క్లుప్తంగా

పది పరీక్ష కేంద్రంలో బందోబస్తు పర్యవేక్షణ

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం సీఐ ఈశ్వరయ్య పర్యవేక్షించారు. ఈ కేంద్రం సీ కావడంతో పోలీసు బందోబస్తును పెంచామన్నారు. అనంతరం ఇతర సెంటర్లను కూడా పర్యవేక్షించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎర్రగుంట్ల : సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చిన్నదండ్లూరు, ఇల్లూరు, కలమల్ల మాలెపాడు గ్రామాలలో మంగళవారం ఆయన సాయుధ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించి మాట్లాడారు. జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ సూచనల మేరకు బలగాలతో గ్రామాలలోని అన్ని వీధులలో కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడ్'తో తల్లీ బిడ్డల సంరక్షణ



బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో సునిత

చక్రాయపేట : తల్లీ బిడ్డల సంరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తోందని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునిత తెలిపారు. మంగళవారం చక్రాయపేటలో ఆమె పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. 15 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం ద్వారా బాలింతలు, గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం, రక్తహీనత, ముర్రుపాలు తదితర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ సుభాషిణి, సీహెచ్‌వో వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీలో జాగ్రత్తవహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

ముద్దనూరు : అంగన్‌వాడీలలో రక్తహీనతను నివారించడానికి పోషకాహారాన్ని అందించడంలో సిబ్బంది జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి పీడీ ఫెడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. కిషోరబాలికల సమాచారం అందుబాటులో వుండాలని, ఆప్ ద్వారానే పోషకాహార సరుకులు అందించాలని, ఐరన్ సిరప్‌ను నమోదుచేయాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణకోసం వున్న హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ముంతాజ్‌బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఆర్టీపీపీ అధికారులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ సర్కిల్ కబడీ టగ్ ఆఫ్ వార్స్ క్రీడా పోటీలను మంగళవారం ఇంజనీరు సోమశేఖర్ రెడ్డి పోటీలను ప్రారంభించి క్రీడా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ పర్యవేక్షణ అధికారి శ్రీధర్, జీఎం ఫైనాన్స్ బాలాజీ, వెల్ఫేర్ అధికారి చార్లెస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత కార్యక్రమంలో విద్యార్థులు

లింగాల : మండలంలోని బోనాల పంచాయతీ అంకెవానిపల్లె గ్రామంలో మంగళవారం పులివెందుల లయోలా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కళాశాల అధ్యాపకులు, సర్పంచు పాల్గొన్నారు.

పెద్దపసుపుల... ప్రగతి బాట

- మండల కేంద్రానికి దూరంగా గ్రామం
- రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామానికి డీబీటీ ద్వారా రూ.29.74 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.4.48 కోట్ల లబ్ధి



గ్రామ బస్టాండ్‌లో ఏర్పాటైన సీసీ రోడ్డు



రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాల



గ్రామ సచివాలయ భవనం

పెద్దముడియం: దశాబ్దాలుగా పల్లెలు అభివృద్ధికి నోచుకోక సమస్యలతో సతమతమవుతుండేవి. పాలకులు మారినా పల్లె ప్రజల కష్టాలు తీరలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టణాలతో పాటు పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, పలు అభివృద్ధి పనులతో పెద్దపసుపుల గ్రామం కళకళలాడుతోంది. మండలంలో పెద్ద పంచాయతీ అయిన ఈ గ్రామంలో 1500 కుటుంబాలు ఉండగా దాదాపు 5,500 మంది జనాభా ఉన్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే ఎక్కువ భాగం ఆధారపడ్డారు. పెద్దపసుపుల గ్రామానికి డీబీటీ ద్వారా రూ.29.74 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.4.48 కోట్లు లబ్ధి ప్రజలకు చేకూరింది. గ్రామంలో రూ.5 కోట్లకు పైగా వ్యయంతో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, కస్తూర్బా జూనియర్ కళాశాల, నూతన జె.పి.పాఠశాల, డ్రైనేజీ, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి తదితర పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు.

ఊర్లోనే అన్ని సేవలు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ చిన్నపని కోసం వెళ్లాలన్నా గ్రామస్తులు మండల కేంద్రం పెద్దముడియంకు వెళ్లాల్సి వస్తుండేది. రవాణా సౌకర్యం లేకపోగ జమ్మలమడుగు వెళ్లి అక్కడ నుంచి పెద్దముడియంకు వెళ్ల వలసి వచ్చేది. దాదాపు 35 కి.మీ. ప్రయాణించాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలోనే గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడంతో అన్ని సేవలు అందుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిపాలన పరమైన భవనాలు, అభివృద్ధి పనులు జరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులు

- రూ.80 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం
- రూ.21 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు
- రూ.30 లక్షలతో సీ.సీ. రోడ్ల నిర్మాణం
- రూ.1.10 కోట్లతో కస్తూర్బా జూనియర్ కళాశాల భవనం ఏర్పాటు
- రూ.1.10 కోట్లతో ఉన్నత పాఠశాల అభివృద్ధి
- రూ.70 లక్షలతో డ్రైనేజీ కాలువల ఏర్పాటు
- రూ.1.40 కోట్లతో నాడు-నేడు కింద గ్రామంలోని పాఠశాలలో అభివృద్ధి పనులు

లబ్ధిదారుల్లో సంతోషం



సచివాలయ సేవలు అందుబాటులోకి వచ్చాక అర్హులకు పథకాలు అందుతున్నాయి. ఇంటికే పథకాలు అందిస్తుండటంతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఎంతో దోహదపడుతున్నాయి. మండల కార్యలయాలు చుట్టే తిరిగే పని లేకుండా గ్రామంలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

–ఎం.ఎల్.శంకర్‌రెడ్డి, పెద్దపసుపుల

పథకాలు పక్కాగా అమలవుతున్నాయి



నవరత్నాలతో పాటు ఇతర పథకాలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు సచివాలయాలు ఎంతగానో తోడ్పడతాయి. గ్రామ వలంటీర్ల సహకారంతో సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయి. అమ్మఒడి, రైతు భరోసా, సున్నావడ్డీ, పింఛన్లు తదితర వాటిని సచివాలయాల ద్వారానే పేదలకు అందుతున్నాయి.

–సర్వేశ్వరరెడ్డి, పెద్దపసుపుల

మహిళలకు ఓటే ఆయుధం

కడప కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలంతా ఓటు ఆయుధంగా వినియోగించుకుని నిజాయతీ గల నాయకుడిని ఎన్నుకోవాలని ఓటరు అవగాహన నోడల్ అధికారి టి.హరిప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లో ఓటరు చైతన్య కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ పోలింగ్ బూత్ వివరాలను హెల్ప్‌లైన్ నంబర్ 1950కి ఫోన్ చేసి తెలుసుకోవాలని వివరించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే సి.విజిల్ యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



మార్నింగ్ విజిట్‌లో పర్యటిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అన్నమయ్య సర్కిల్, క్రిష్టా సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, దేవుని కడప రోడ్డు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సర్కిల్ నుంచి క్రిష్టా సర్కిల్ వరకూ డివైడర్లు నిర్మించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ కాలువలపై స్లాబ్ వేయాలని, . పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద ఆక్రమణలను తొలగించాలన్నారు. మున్సిపల్ ఉర్దూ పాఠశాల వద్ద జరుగుతున్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

వైఎస్ కొండారెడ్డిని కలసిన టీడీపీ నేతలు



వైఎస్ కొండారెడ్డిని కలసిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి వర్గం

చక్రాయపేట : వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిని మంగళవారం చక్రా యపేట మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు బందలకుంట ఈశ్వరరెడ్డి తన అనుచర వర్గంతో ఇడుపులపాయలోని వైఎస్ఆర్ అతిథి గృహం వద్ద కలుసుకున్నారు. ఈశ్వరరెడ్డి మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉంటూ చక్రాయపేట మండలంలో తెదేపా తరపున ప్రధాన భూమికను పోషిస్తుండేవారు. ఇటీవల సతీష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఈశ్వరరెడ్డి కూడా త్వరలోనే పార్టీ మారేనిమిత్తం తన అనుచర వర్గంతో ఇడుపులపాయకు వచ్చి కొండారెడ్డిని కలిశారు. త్వరలోనే పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయన వెంట బసిరెడ్డి, దర్మారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, హనుమం తురెడ్డి, ప్రసాదరెడ్డి, బసవేశ్వరరెడ్డి, దివాకర్, బసిరెడ్డి, పెండెం చిన్నగంగయ్య, సతీష్, రామచంద్రారెడ్డి, పాపిరెడ్డి, రామిరెడ్డి, ఉత్తమారెడ్డి, గంగిరెడ్డి, లోకనాథరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, బాబురెడ్డి, రాంబాబు, నారాయణ, రమణ, శ్రీనివాసులు తదితరులు కొండారెడ్డిని కలిసి సత్కరించారు.

మేలు చేసిన జగనన్నకు ఓటు వేయండి



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : ప్రజలకు మేలు చేసిన జగనన్నకు ఓట్లు వేసి గెలిపించాలని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కుమారకాల్వ దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో చేసిన మేలును, చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేస్తే రానున్న రోజుల్లో ముఖ్యమంత్రిగా జగనన్న, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలు గెలిచి మనందరి మేలు కోసం నిరంతరం కృషి చేస్తారన్నారు. చంద్రబాబులా మోసం చేయడం వైఎస్ కుటుంబానికి చేతకాదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు మౌలా, సింగిల్‌విండో అధ్యక్షుడు శేషారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరు

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పది పరీక్షల్లో హిందీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 356 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 352 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 239 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 235 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా 117 మంది హాజరయ్యారు.

కాగా మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సంభందించి ఏపీ మోడల్ స్కూల్‌లో 156 మంది విద్యార్థులకు 150 మంది హాజరయ్యారు. ఆరు మంది గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 125 మంది విద్యార్థులకు 118 మంది హాజరయ్యారు. 7 మంది గైర్హాజరయ్యారు. పదవ తరగతి పరీక్షలను స్క్వాడ్ జాఫర్ సాధిక్ తనిఖీ చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ నజీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలి వున్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, బడి మాని వేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ కుటుంబాలకు చెందిన బాళికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హులైన బాలికలు ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వల్లూరు కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 40 సీట్లు అందుబాటులో వున్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

నేత్రదానం



కుటుంబ సభ్యులను నుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రశాంతినగర్‌కు చెందిన మండ్లి సుబ్బమ్మ మంగళవారం మృతి చెందింది. ఆమె కుంటుబీకులు అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు రాజు తెలిపారు. కుటుంబంలోని వ్యక్తి లేదా స్నేహితులు మరణిస్తే వెంటనే 9966509364, 6093204537 ఫోన్ నంబర్లకు సమాచారం అందిస్తే అంధరహిత సమాజం కోసం కృషి చేసిన వారవుతారన్నారు.

ట్యాలీ ప్రైమ్‌తో ఉపాధి అవకాశాలు

కమలాపురం : ట్యాలీ ప్రైమ్‌తో ఉపాధి అవకాశాలు సులువుగా సాధించవచ్చని ఏపీ, టీజీ ట్యాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ టి.మల్లేశ్వరగుప్తా తెలిపారు. మంగళవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ట్యాలీ ప్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ తరుణంలో ఏ చిన్న అవకాశం వచ్చినా వదలకూడదన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాలీ ప్రైమ్ నిరుద్యోగులకు ఒక వరం లా మారి ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిస్తోందన్నారు. ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ లోకేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ కోర్స్‌లో శిక్షణ పొందితే బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లో ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ భారత్



గ్రామాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : మండలంలోని కుమ్మరాంపల్లె, నందిపల్లె గ్రామాలలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ అధికారులు తిరుపతిరెడ్డి, ఇందుమతిలు తెలిపారు. ఇడుపులపాయ, ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లకు చెందిన ఎన్ఎస్ఎస్ 12, 14 విభాగం విద్యా వలంటీర్లు ఆయా గ్రామాల్లోని గుడి, బడి, అంగన్‌వాడీ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అలాగే మైనార్టీ గురుకుల పాఠశాల, ఉమెన్స్ ఎడ్యూకేషన్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. విద్య అనేది ప్రతి పౌరుని హక్కు ఇది లింగ వివక్షను అరికట్టేందుకు తోడ్పడతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసుదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

పులివెందుల రూరల్ : స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో మంగళవారం స్పైడర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ బిటెక్ నాలుగో సంవత్సరం సీఎస్ఈ బ్రాంచ్ నుంచి నలుగురు, మెకానికల్ బ్రాంచ్ నుంచి ఒక్కరు ఈఈఈ బ్రాంచ్ నుంచి ఒక్కరు ఈసిఈ నుంచి 10 మంది మొత్తం 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపీకయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, సూర్యనారాయణరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరికి శాలరీ ప్యాకేజీ 3.5 నుంచి 5.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపీకైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారులు రాధాకృష్ణ, సాంబయ్యలు అభినందించారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వేంపల్లె : మండల పరిధిలోని కుమ్మరాంపల్లె గ్రామంలోని ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించినట్లు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డాక్టర్ మల్లేశ్వరమ్మ, విద్యా వలంటీర్లు ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రత్యేక అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసి వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఏర్పాటుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అలాగే ఓటు హక్కు, ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రెడ్డి మాలతి, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో సామూహిక పూజలు చేశారు. భక్తులు ఈ సందర్భంగా ఆలయం ఎదుట దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వాటి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభించిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. కలమల్ల గ్రామంలోని పునరావాస కాలనీలో మంగళవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా వెంటాడుతున్న సమస్యలను ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కరించుకున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అందించి పేద కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటిని నూరు శాతం నెరవేర్చారన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించి వారి కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కలమల్ల గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి ఎద్దడిపై దృష్టి సారించాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందస్తుగా తాగునీటి సమస్యలు ఏర్పడే గ్రామాలను గుర్తించాలన్నారు. ఎక్కడైన మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో ఎక్కువగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈకి సర్పంచ్‌లు విన్నవించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏఓ అల్తాఫ్ హుస్సేన్, పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

సువిధ యాప్‌లో నమోదు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, మీటింగులు, మైక్‌సెట్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే సువిధ యాప్‌లో నమోదు చేసుకోవాలని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, సమావేశాలు, బ్యానర్లు ఏవైనా కట్టుకోవాలన్నా సువిధ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ మద్దిలేటిలు మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రూపుల అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. సొంత వెహికల్స్‌కు కూడా పర్మిషన్ తీసుకుని చెండాలు పెట్టుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పర్మిషన్లు ఉండవన్నారు. పబ్లిక్‌లో ఉన్న రాజకీయ నాయకుల బొమ్మలను కనబడకుండా గుడ్డలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి

కమలాపురం : ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ కేటాయింపుల్లోని నిధులను, సెంటర్ల రెన్యువేషన్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసిన వస్తువులను బహిరంగ వేలం లేదా టెండర్ పిలవకుండా ఏకపక్షంగా ఎలా కొనుగోలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఐసీడీఎస్ అధికారులు చేతివాటం ప్రదర్శించి కమీషన్ల కోసం కక్కుర్తి పడి వస్తువులు కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని 13 ప్రాజెక్ట్‌ల్లో 1030 సొంత భవనాలు ఉన్నాయన్నారు. ప్రతి సెంటర్ నిర్వహణకు ఏటా రూ.3వేలు మంజూరు చేస్తారని, అయితే గత ఏడాది నిధులు మంజూరు చేయక పోవడంతో ఈ ఏడాది రూ.6 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ నగదును వర్కర్ల ఖాతాలో జమ చేశారన్నారు. అయితే అందులో రూ.3 వేలు వెనక్కు ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులు వర్కర్లకు హుకుం జారీ చేయడం వెనుక పరామర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు రమేష్ పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ బలోపేతానికి కృషి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మిక పరిషత్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిషత్ రీజినల్ కార్యదర్శి పురుషోత్తం పిలుపు నిచ్చారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ రీజనల్ కౌన్సిల్ సమావేశం మంగళ వారం జరిగింది. జోనల్ చైర్మన్ పీవీఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కడపకు చెందిన డాక్టర్ కృష్ణ కిషోర్‌రెడ్డిని కార్మిక పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల మరణించిన మహిళా కండక్టర్ కుసుమకుమారి మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఇదే క్రమంలో వివిధ యూనియన్లకు చెందిన 15 మంది కార్మిక పరిషత్‌లో చేరారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ అధికారులు, సూపర్ వైజర్లు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.